సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



సోమశిలలో 62.640 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారానికి 62.640 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 29 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,740
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,157
3 శాతం జీఎస్టీతో	రూ.5,312
సవర (8 గ్రా)	రూ.42,496

గరిష్టం/కనిష్టం
33.5 /22.3

వాతావరణం

శుక్రవారం గాలిలో 57 శాతం తేమ ఉంది. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. శనివారం పొడి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన కాకాణి



రాష్ట్ర నూతన గవర్నర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. – విజయవాడ

ఉపాధి సోషల్ ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రక్రియను శుక్రవారం నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో ఇందుకూరుపేట మండలానికి సంబంధించిన ఆడిట్ ప్రక్రియను కార్యాలయంలో జరిపారు. క్లస్టర్ ఏపీడీలు సంజీవరావు, శ్రీహరిరెడ్డి, డీవీఓ సురేష్‌బాబు, అంబుడ్స్‌మెన్ వెంకటరమణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగంగా చేయాలి

అల్లూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న భూ రీసర్వే వేగంగా పూర్తి చేయాలని ఆర్డీఓ శీనానాయక్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందికి, సర్వేయర్లకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చేయవల్సిన పనులను వారికి వివరించారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ, సర్వేయర్ అనురూప్, ఆర్ఐ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

27న ఉద్యోగుల భవిష్యనిధిపై సమావేశం

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన సమావేశం జరుగుతుందని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్ కళాశాల ప్రాంగణంలో జరిగే ఈ సమావేశంలో పాల్గొనాలని వినియోగదారులను కోరారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభివృద్ధికి అడ్డంకిగా మారారని విమర్శలున్నాయి. తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆయన కార్పొరేషన్ మేయర్‌ను తన కనుసన్నల్లో పెట్టుకుని ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓ వైపు ఏ పని జరగకుండా అడ్డుకుంటూనే.. బయటికి మాత్రం ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మేయర్ కూడా శ్రీధర్‌రెడ్డి చెప్పినమాటే వింటున్నారని తెలిసింది.

- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రయత్నం
- ఆయన కనుసన్నల్లోనే మేయర్ స్రవంతి
- కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల ఫైల్స్ పెండింగ్
- ఆగిన ఉద్యోగుల పదోన్నతులు
- ఏడునెలల నుంచి కౌన్సిల్ సమావేశాల్లేవు



కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తా.. అభివృద్ధి పనులు చేయకుంటే నిలదీస్తానంటూ కొద్దిరోజులుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రచ్చ చేస్తున్నారు. ఇది ఆయన వ్యూహంలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు పనులు జరగడం లేదని చెబుతున్న ఆయనే అవి జరగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికోసం కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతిని అడ్డుపెట్టుకున్నారు. ఆయన ఆడుతున్న డ్రామాపై ప్రజలు మండిపడుతున్నారు.

సమావేశాలు పెట్టకుండా..

నగరపాలక సంస్థ పరిధిలో రూ.10 లక్షలకు పైగా నిధులతో పనులు చేయాలంటే మేయర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. లేనిపక్షంలో కౌన్సిల్లో తీర్మానించాలి. మేయర్ ఆధ్వర్యంలో గతేడాది జూలై 29వ తేదీన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ తర్వాత వాటి ఊసే లేదు. ఇదంతా శ్రీధర్‌రెడ్డి ముందస్తు ప్రణాళికలో భాగమేననే ప్రచారం జరుగుతోంది. టీడీపీకి టచ్‌లోకి వెళ్లిన ఆయన కొంతకాలంగా ప్రభుత్వంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే పనులు చేయడంలేదని ప్రచారం చేసేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. పనులకు సంబంధించి అధికారులు పంపిన ఫైల్స్‌పై మేయర్ సంతకాలు చేయడంలేదనే ఆరోపణలున్నాయి. దీనికి కారణం శ్రీధర్‌రెడ్డేనని భావిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల సమావేశాలు పెట్టలేదని రూరల్ ఎమ్మెల్యే డైరెక్షన్‌లో మేయర్ కొత్త పల్లవి అందుకున్నారు. అయితే కోడ్ కొద్దిరోజుల క్రితమే వచ్చింది. నెలలపాటు సమావేశాలు పెట్టలేదు. అభివృద్ధి పనుల ఫైల్స్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి వస్తుందని ముందస్తు వ్యూహంలో భాగంగానే శ్రీధర్‌రెడ్డి మేయర్ ద్వారా కౌన్సిల్ సమావేశం జరగకుండా చూశారని ప్రచారం ఉంది.

పదోన్నతులు దక్కకుండా..

ప్రభుత్వ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రావాల్సిన పదోన్నతుల విషయంలోనూ మేయర్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నరసింహారావుకు శానిటరీ సూపరింటెండెంట్లుగా, ఎ.ప్రవీణ్, వై.చెన్నయ్యకు సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్లుగా పదోన్నతులు దక్కాలి. అయితే మేయర్ కావాలనే ఈ నాలుగు ఫైల్స్‌ను పెండింగ్‌లో ఉంచారని ఆరోపణలున్నాయి.



రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి (ఫైల్)

అభివృద్ధి జరగకుండా...

కార్పొరేషన్ ద్వారా ప్రజల కోసం ఎన్నో పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అధికారులకు మేయర్ సహకారం తప్పనిసరి. అభివృద్ధి జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది. టీడీపీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న శ్రీధర్‌రెడ్డికి ఇది జరగడం ఇష్టం లేదని చెబుతున్నారు. మేయర్ స్రవంతి కూడా రూరల్ ఎమ్మెల్యే బాటలో పయనిస్తామని గతంలో ప్రకటించారు. ఆమె తన వర్గంలో ఉండటం శ్రీధర్‌రెడ్డికి కలిసొచ్చింది. దీంతో కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి జరగకుండా అడ్డుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

వీటిలోనూ అడ్డంకులు

మేయర్ స్రవంతి ఓ వైపు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకపోవడం.. నిధుల విడుదలకు ఆమోదం తెలపకపోవడంతో చీపుర్లు, బ్లీచింగ్ పౌడర్ల సరఫరాకు అడ్డంకులు ఏర్పడ్డాయని చెబుతున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు అధికారులు తమవంతు కృషి చేస్తున్నా... మేయర్ నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది.

కోడ్ వల్ల సమావేశాలు పెట్టలేకపోయాం

రూ.10 లక్షలకుపైగా నిధులతో పనులు చేపట్టే విషయం నా దృష్టికి రాలేదు. రెండు పదోన్నతుల (శానిటరీ సూపర్‌వైజర్) ఫైల్స్ కమిషనర్ హరిత వద్ద ఉన్నాయి. మరో రెండు పదోన్నతులకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో విచారిస్తున్నాం. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించలేకపోయాం. కోడ్ ముగిసిన తర్వాత ఏర్పాటు చేస్తాం.

– పొట్లూరి స్రవంతి, మేయర్

క్షుణ్ణంగా నామినేషన్ల పరిశీలన

- గ్రాడ్యుయేట్‌కు సంబంధించి 7 తిరస్కరణ, 23 ఆమోదం
- టీచర్‌కు 8 నామినేషన్ల ఆమోదం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం చిత్తూరులోని కలెక్టరేట్‌లో జరిగింది. అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోనశశిధర్, అభ్యర్థుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎందుకు తిరస్కరించామో అభ్యర్థులకు అధికారులు వెల్లడించారు. ఆమోదించిన, తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం నోటీస్ బోర్డులో ఉంచారు. బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను ఈనెల 27వ తేదీన ప్రకటిస్తారు. కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, ఏఓ కులశేఖర్, సూపరింటెండెంట్లు మురళి, వెంకటేశ్వర్, శేషగిరి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

➡ పట్టభద్రులకు సంబంధించి 30 నామినేషన్లలో 23 ఆమోదించగా ఏడింటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 8 నామినేషన్లు రాగా మొత్తం ఆమోదం పొందాయని ప్రకటించారు.



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహిస్తున్న చిత్తూరు కలెక్టర్, ఆర్వో హరినారాయణన్

పచ్చకుట్ర బట్టబయలు

- టీడీపీ మద్దతు సర్పంచ్ ఇండిపెండెంట్‌గా స్థానిక సంస్థల్లో నామినేషన్
- ప్రతిపాదకురాలి సంతకం ఫోర్జరీ
- నామినేషన్ తిరస్కరణ
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీది ఓకే
- ఒకే నామినేషన్ కావడంతో ఏకగ్రీవం కానున్న ఎన్నిక

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీలకు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియలోనే టీడీపీ అభాసుపాలైంది. ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే బలం లేకపోయినా టీడీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ చేత ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేయించారు. ప్రతిపాదకులు జాబితాలో సూళ్లూరుపేటకు చెందిన ఓ మున్సిపల్ మహిళా కౌన్సిలర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. శుక్రవారం పరిశీలన జరగ్గా సదరు మహిళ రిటర్నింగ్ అధికారికి నేరుగా ఫిర్యాదు చేయడంతో టీడీపీ నేతల కుట్ర బయటపడింది. ప్రతిపాదకురాలి సంతకం ఫోర్జరీ కావడంతో ఆ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తిరస్కరించారు.

బలం లేదని తెలిసినా..

గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. ఆ ఎన్నికలను టీడీపీ బహిష్కరిస్తున్నట్లు ప్రకటన చేసినా ఆ పార్టీ గుర్తుతో పలుచోట్ల అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఫ్యాన్ ప్రభంజనంతో సైకిల్ పంక్చరైంది. ఎన్నిక ఏదైనా వార్ వన్‌సైడ్ అన్నట్లుగా సాగింది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ కార్పొరేటర్లు ఓటర్లుగా ఉంటారు. జిల్లాలో 763 మంది ఓటర్లుగా ఉండగా టీడీపీకి పదిశాతం ఓట్లు కూడా లేవు. బలం లేదని స్పష్టంగా తెలుసున్నా టీడీపీ నేతలు పెళ్లకూరు మండలం బంగారుపాళెం సర్పంచ్, టీడీపీ సానుభూతి పరుడైన దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ చేత స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించారు. సాధారణంగా దీనికోసం పదిమంది సభ్యులు ప్రతిపాదకులుగా ఉంటారు. నాగేంద్రప్రసాద్ నామినేషన్‌లో ప్రతిపాదకుల కింద సూళ్లూరుపేట మున్సిపాలిటీ 8వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చెంగమ్మ సంతకం ఉంది. అయితే అభ్యర్థి తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ఆమె దృష్టికి వెళ్లడంతో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసింది. దీంతో నాగేంద్రప్రసాద్ నామినేషన్‌ను తిరస్కరించారు. విజయం సాధించే ఓట్లు లేకున్నా కేవలం పచ్చనేతలు ఎన్నికలు నిర్వహించేలా చేయాలన్న కుట్ర కోణంతో నామినేషన్ వేయించి అభాసుపాలయ్యారు.

ఎన్నిక లాంఛనమే..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళి ఎన్నిక లాంఛనంగా మారింది. పార్టీకి విధేయుడిగా ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మురళికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు.

పక్కాగా చూసి..

నెల్లూరు(అర్బన్): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, జేసీ రోణంకి కూర్మనాథ్ స్క్రూట్నీ చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థి నాగేంద్రప్రసాద్ సంతకం ఫోర్జరీ చేసినందున ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళి నామినేషన్‌ను ఆమోదించారు.

➡ కలెక్టరేట్ వద్ద తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ 18 స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుంటే అందులో 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినవ అంబేడ్కర్ అని కొనియాడారు. సీఎం బడుగు, బలహీనవర్గాల పక్షపాతి అన్నారు. పేదల అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న ఆయనపై టీడీపీ నాయకులు పిచ్చిపట్టినట్టు ఏదో ఒకటి మాట్లాడుతున్నారన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్, చిత్రంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళి

లోకేశ్ పాదయాత్రకు ప్రజల మద్దతు లేదని తెలిపారు. జగనన్న పాదయాత్ర సమయంలో లక్షలాదిగా ప్రజలు కదిలి వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారన్నారు.

➡ మురళి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసినందువల్లే తనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించారన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కంచే చేను మేస్తే..

- మహిళా బ్యాంకులో మనీ మాయం
- అవినీతికి పాల్పడిన డైరెక్టర్, మేనేజర్, క్యాషియర్
- రూ.1.50 కోట్ల వరకు స్వాహా
- లబోదిబోమంటున్న పొదుపు మహిళలు
- విచారణ చేపట్టిన అధికారులు

కంచే చేను మేసింది అన్న చందంగా ఖాతాదారులు దాచుకున్న నగదుకు రక్షణ కల్పించాల్సిన బ్యాంకు నిర్వాహకులు ఆ సొమ్మును స్వాహా చేశారు. బ్యాంకు లావాదేవీల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారు. కూలీనాలీ చేసి సంపాదించి బ్యాంకు రుణం చెల్లించాలని వారి చేతికిచ్చిన నగదును సైతం జమ చేయకుండా తమ సొంత ప్రయోజనాలకు వాడుకుని నమ్మిన వారిని నట్టేట ముంచారు. అధికశాతం మంది పేద ఎస్సీ కుటుంబాలను మోసం చేశారు.



మహిళా బ్యాంకు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు మహిళా బ్యాంకులో డైరెక్టర్, మేనేజర్, క్యాషియర్ కలిసి ఖాతాదారులుగా ఉన్న పొదుపు మహిళల నగదును స్వాహా చేశారు. సుమారు రూ.1.50 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారు. నగదు జమ చేయని విషయాన్ని తెలుసుకొన్న పొదుపు మహిళలు లబోదిబోమంటున్నారు. రెండు, మూడేళ్లుగా బ్యాంకులో అవకతవకలు జరుగుతున్నా గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రూ.5 కోట్ల టర్నోవర్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో మండలంలోని ఇందుకూరుపేట బిట్–2(కొత్తూరు)లో 1999లో మహిళా బ్యాంకు ఏర్పడింది. ప్రస్తుతం సుమారు 200 గ్రూపులతో రూ.5 కోట్ల టర్నోవర్ (మూలధనం)తో బ్యాంక్ లావాదేవీలు కొనసాగిస్తోంది. మహిళా బ్యాంకు అధ్యక్షురాలిగా యు.అరుణకుమారి, ఉపాధ్యక్షురాలిగా వి.మాధవమ్మ కొనసాగుతుండగా, మరో పదిమంది డైరెక్టర్లుగా ఉన్నారు. మేనేజర్‌గా హసీనా, క్యాషియర్‌గా షేక్ రమీజా, మరికొందరు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు బ్యాంకు కార్యకలాపాలను కొనసాగించాల్సి ఉంది.

పలు అనుమానాలు

మహిళా బ్యాంకు పరిధిలో సుమారు 200 గ్రూపులు ఉండగా కేవలం డైరెక్టర్ అన్నపూర్ణ పరిధిలో ఉన్న గ్రూపులకు సంబంధించి మాత్రమే రికార్డులు, నగదు చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈమె పరిధిలో పలు గ్రూపులు ఉండగా.. ఎస్సీకాలనీకి చెందిన గ్రూపుల్లో అవకతవకలు జరిగాయి. వారు ప్రశ్నించలేరనే ధైర్యంతోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది.

నిబంధనలకు నీళ్లు

ప్రభుత్వ ఉద్యోగులు పొదుపు గ్రూపు అధ్యక్షులుగా ఉండటం నిబంధనలకు విరుద్ధం. కాగా డైరెక్టర్ అన్నపూర్ణ సోదరి అయిన చనుమూరి శోభ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొనసాగుతూనే దుర్గా గ్రూపునకు అధ్యక్షురాలిగా ఉంది. ఈ గ్రూపు ద్వారా లక్షలాది రూపాయలు లావాదేవీల కొనసాగిస్తూ అక్రమాలకు పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రూపుతోపాటు మరో రెండు గ్రూపులను అన్నపూర్ణమ్మ కొనసాగిస్తునట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే సభ్యులు చెల్లించిన నగదుకు రశీదులు ఇవ్వడం, సంబంధిత రికార్డుల్లో, పాస్‌పుస్తకాల్లో నమోదు చేయించడం తదితర ప్రాథమిక విధులను సైతం అన్నపూర్ణ అనుసరించలేదని తెలుస్తోంది. ఈ విషయాన్ని మొదట్లోనే గుర్తించి ప్రశ్నించాల్సిన మేనేజర్ హసీనా, క్యాషియర్ రమీజా మిన్నకుండిపోవడంతో వీరు కూడా ఇందులో భాగస్వాములుగా ఉండి అన్నపూర్ణకు సహకరించారని బాధితులు ఆరోపిస్తున్నారు. అలాగే హసీనా, రమీజా సైతం మరిన్ని అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

అడిగితే ఆత్మహత్య చేసుకుంటా..

తనను నగదు గురించి నిలదీస్తే ఆత్మహత్య చేసుకుంటానని అన్నపూర్ణ బెదిరించినట్లు బాధితులు వాపోతున్నారు. అంతేకాక తమ ఇంటికి వచ్చి నగదు విషయాన్ని అడగకూడదంటూ నోటీసులు పంపినట్లు వారు చెబుతున్నారు. తాను టీడీపీకి చెందిన మహిళను కావడంతోనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని, తనకు సహకారం అందించాలని కోరుతూ అన్నపూర్ణ ఆ పార్టీ నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోందని బాధితులు చెబుతున్నారు. తమను మోసం చేసిన విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలని బాధిత పొదుపు మహిళలు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారెవరో అధికారులు నిగ్గుతేల్చాల్సి ఉంది.

వెలుగు చూసిందిలా..

మండలంలోని మైపాడు ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఈ బ్యాంకులో నగదు దాచుకోవడంతో పాటు రుణాలు తీసుకుని తిరిగి క్రమం తప్పకుండా చెల్లిస్తుంటారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే ఏడు గ్రూపుల్లోని సుమారు 70 మంది సభ్యులు ప్రతి శుక్రవారం స్థానికంగా ఉన్న బ్యాంక్ డైరెక్టర్ బద్దిపూడి అన్నపూర్ణను నమ్మి ఆమెకు నగదును ముట్టచెబుతారు. ఈ క్రమంలో ఒక గ్రూపునకు సంబంధించి రుణం పూర్తిగా చెల్లించడంతో కొత్తగా రుణం తీసుకునేందుకు గ్రూపు సభ్యులు సిద్ధమయ్యారు. అయితే అప్పటివరకు ఉన్న డైరెక్టర్ అన్నపూర్ణ వ్యక్తిగత కారణాలతో బ్యాంకుకు దూరంగా ఉన్నారు. దీంతో గ్రూపు సభ్యులు నేరుగా బ్యాంకుకు వెళ్లి తమ నగదు లావాదేవీలపై సిబ్బందిని సంప్రదించారు. బ్యాంకు సిబ్బంది రికార్డులు పరిశీలించి గ్రూపు సభ్యులు సక్రమంగా రుణం చెల్లించడం లేదని, మరలా రుణం ఇవ్వడం కుదరదని తెగేసి చెప్పారు. అవాక్కయిన సభ్యులు ఈ విషయాన్ని మిగిలిన వారికి తెలియజేశారు. అందరూ బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా ఏడు గ్రూపులకు సంబంధించి ఇచ్చిన డబ్బును స్వాహా చేసినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా బ్యాంకు డైరెక్టర్ అన్నపూర్ణ.. మేనేజర్ హసీనా, క్యాషియర్ రమీజా సహకారంతోనే ఈ నమ్మక ద్రోహానికి పాల్పడిందని బాధిత పొదుపు మహిళలు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.1.50 కోట్ల వరకు బ్యాంకులో గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. కాగా బ్యాంకులో జరిగిన అక్రమాలపై కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ గత రెండు వారాలుగా విచారణ జరుపుతున్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

నగదు చెల్లించకపోవడం వాస్తవమే..

బ్యాంకుకు సంబంధించిన లావాదేవీల్లో గోల్‌మాల్ జరిగింది వాస్తవమే. మేనేజర్, క్యాషియర్, డైరెక్టర్ కలిసి అవినీతికి పాల్పడ్డారు. దీనిపై అధికారులు ఇప్పటికే విచారణ చేపట్టారు.

– అరుణకుమారి, బ్యాంకు అధ్యక్షురాలు

ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోంది

మహిళా బ్యాంకు ద్వారా మేము రుణం తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఉదయం బ్యాంకు డైరెక్టర్ అన్నపూర్ణ మా వద్ద నగదు తీసుకుని వెళుతుంది. ఆమెపై నమ్మకంతో డబ్బు ఇచ్చాం. అయితే ఆ మొత్తాన్ని ఆమె బ్యాంకులో జమచేయలేదు. బ్యాంకు వాళ్లు తనను మోసం చేశారని చెబుతోంది. నగదు విషయంపై తనను ప్రశ్నిస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోంది.

– ఈదూరు విజయమ్మ, మునలి ప్రభావతి, పొదుపు గ్రూపుల అధ్యక్షులు



ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. 384 మంది విద్యార్థులకు గానూ 348 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

3 నుంచి ప్రత్యేక కంటి వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీతో బాధపడుతున్న వారి కోసం వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏఆర్టీ సెంటర్‌లో ప్రత్యేక ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. మందులు పంపిణీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1, 2, 3, 7 సమావేశాలు, మధ్యాహ్నం మూడు గంటలకు 4, 5, 6 సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సభ్యులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

హాస్టల్స్ తెరవాలి

నెల్లూరు(టౌన్): సమగ్రశిక్ష మంజూరు చేసిన హాస్టల్స్‌ను కచ్చితంగా తెరవాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 23 సీజనల్ హాస్టల్స్ మంజూరు చేసినట్లు చెప్పారు. వారికి కేటాయించిన మండలాల్లోనే హాస్టల్స్‌ను నిర్వహించాలన్నారు. వాటిని స్పెషల్ ఆఫీసర్స్, ఎంఈఓలు, క్లస్టర్స్ ఆర్పీలు తరుచుగా సందర్శించాలన్నారు. సీజనల్ హాస్టల్స్‌లోని కేర్ టేకర్, విద్యా వలంటీర్ సేవలను సమీపంలోని ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు సంసిద్ధమవుతున్న విద్యార్థులకు కూడా అందించాలన్నారు.

ఒకటి నుంచి ప్రాక్టికల్స్

నెల్లూరు(టౌన్): డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీకి సంబంధించి సైన్స్ విద్యార్థులకు వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ రీజనల్ కో–ఆర్డినేటర్ పిచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సర్వోదయ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 73829 29611 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	106
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	210
లేయర్ చికెన్ :	128



నిమ్మధరలు (కిలో)

పెద్దవి:	రూ.80
సన్నవి:	రూ.65
పండ్లు:	రూ.35



దూసుకెళ్తూ.. పతకాలు సాధిస్తూ..

ఖోఖోలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు



- నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉచితంగా శిక్షణ
- మెలకువలు నేర్పిస్తున్న కోచ్‌లు
- జాతీయస్థాయిలో రాణించిన పదిమంది
- నేర్చుకునేందుకు బాలబాలికల క్యూ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఖోఖో క్రీడాకారులతో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కళకళలాడుతోంది. ఉదయం, సాయంత్రం ఇక్కడి ఖోఖో కోర్టుకు బాలబాలికలు క్యూ కడుతున్నారు. వేగానికి, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ఖోఖో సాధన, మ్యాచ్‌లతో ప్రాంగణం సందడిగా ఉంటోంది. కాంప్లెక్స్‌లో 14 క్రీడాంశాల్లో శిక్షణ, సాధన జరుగుతుంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే 80 నుంచి 90 మంది క్రీడాకారులు రోజూ ఖోఖో సాధన చేస్తుంటారు. ఉదయం ఎక్సర్‌సైజ్‌లతోపాటు ఆటలో మెలకువలు నేర్చుకుంటుంటారు. సీనియర్ క్రీడాకారులు మ్యాచ్‌లు ఆడుతూ తమ క్రీడా ప్రతిభకు మెరుగులు దిద్దుతుంటారు.

రాణించి..

కాంప్లెక్స్‌లో శిక్షణ తీసుకున్న అనేకమంది పోటీల్లో రాణిస్తున్నారు. గత ఆరు సంవత్సరాల్లో జిల్లాస్థాయిలో 50 మంది, రాష్ట్రస్థాయిలో 40 మంది, జాతీయస్థాయిలో పదిమంది ప్రతిభ చూపారు. పదిమంది రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. దీంతో కొత్తగా నేర్చుకునేందుకు అనేక మంది వస్తున్నారు. కాగా ఖోఖో ఆడేవారిలో సాధారణంగా ఆర్థికంగా వెనుకబడిన వారే ఉంటారు. వారి అవసరాలను గుర్తించి విద్యతోపాటు క్రీడలో రాణించేందుకు ఇక్కడి కోచ్ సుకుమార్ సహాయ సహకారాలు అందిస్తున్నారు. 2016 సంవత్సరంలో జరిగిన ప్రమాదంలో తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు శృతి, పల్లవీని బాలసదన్‌లో చేర్పించి ఖోఖోలో శిక్షణ ఇచ్చారు. 6వ తరగతిలో వారు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం శృతి జాతీయస్థాయిలో ఫుట్‌బాల్‌లో రాణిస్తోంది. పల్లవి ఖోఖోలో కొనసాగుతోంది.




ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఖోఖో సాధన చేస్తున్న బాలబాలికలు

నాడు ఆడి.. నేడు ఆడిస్తూ..

ఖోఖో కోచ్ సుకుమార్ ఈ స్టేడియంలోనే క్రీడా ప్రస్థానం ప్రారంభించారు. విద్యార్థి దశలో రోజూ పది కిలోమీటర్లు సైకిల్‌పై స్టేడియంకు చేరుకుని అప్పటి కోచ్‌లు, అసోసియేషన్ నాయకుల సహకారంతో క్రీడల్లో రాణించాడు. 25 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 16 పతకాలను సాధించాడు. బీపీఈడీ, ఎంపీఈడీ, ఎంఏ, ఎన్ఐఎస్ వంటి ఉన్నత విద్యను పూర్తి చేశాడు. తను ఆట నేర్చుకున్న గ్రౌండ్‌లోనే శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. ఖోఖో ఇండియా ఏపీ జట్టుకు రెండుసార్లు కోచ్‌గా వ్యవహరించాడు. అండర్–14, అండర్–16 ఆంధ్రప్రదేశ్ జట్లు బంగారు పతకాలు సాధించేలా జట్టుకు శిక్షణ ఇచ్చాడు. ఉత్తమ క్రీడాకారుడిగా మూడుసార్లు ప్రశంసా పత్రాలను అందుకున్నాడు. 2022 స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉత్తమ కోచ్‌గా మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని స్వీకరించాడు.



మంత్రి రాంబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సుకుమార్ (ఫైల్)

శిక్షణ ఇలా..

- ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఖోఖోలో ఉచిత శిక్షణ ఇస్తారు.
- ఇందుకోసం సంప్రదించాల్సిన డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఫోన్ నంబర్ : 91211 06835, ఖోఖో కోచ్ ఫోన్ నంబర్ : 93904 48732

ఆటలంటే ఇష్టం



మేము బీవీ నగర్‌లో ఉంటాం. నేను ఓవెల్ స్కూల్లో రెండో తరగతి చదువుతున్నా. నాకు ఆట లంటే ఇష్టం. నాన్న కమలాకర్‌రెడ్డి, అమ్మ సుప్రియ రోజూ గ్రౌండ్‌కు తీసుకొచ్చి వదులుతారు. ఖోఖో ప్రాక్టీస్ చేస్తా. ఈ క్రీడలో పెద్ద ప్లేయర్‌ని కావాలని ఆశ.

– కార్తీక్, రెండో తరగతి

క్రీడలతోనే గుర్తింపు



ఖోఖోతో నాకెంతో గుర్తింపు వచ్చింది. నేర్చుకున్న క్రీడను మిగిలిన వారికి నేర్పాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ చేస్తున్నా. ఖోఖోలో రాష్ట్రస్థాయిలో తొమ్మిది సార్లు ఆడాను. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో రాణించాను. అసోసియేషన్ నాయకులు గిరి, విజయ, గురుప్రసాద్, కోచ్ సుకుమార్ ఇచ్చిన ప్రోత్సాహంతో రాణించాను. భవిష్యత్ క్రీడాకారులను తయారు చేస్తాను.

– షేక్ నజీమ్, పీఈటీ ట్రెయినీ

సాధన అవసరం



క్రీడల్లో క్రమం తప్పని సాధన అవసరం. ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు వారి అవసరాలను గుర్తించి క్రీడలతోపాటు చదువులో రాణించేందుకు ప్రోత్సాహం అందిస్తాం. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, అసోసియేషన్ నాయకుల సహకారంతో ఖోఖోలో ప్రతి ఏడాది జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు గణనీయమైన సంఖ్యలో క్రీడాకారులు రాణిస్తున్నారు.

– సుకుమార్, ఖోఖో కోచ్

విద్యార్థి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

కావలి రూరల్: కొందరు వ్యక్తుల వేధింపులు తాళలేక ఓ విద్యార్థి ఈనెల 18వ తేదీన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న కేసులో శెట్టిపల్లి సన్నీ, ప్రేమ్ దిలీప్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కొర్సిపాటి ప్రసన్నకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటరమణ శుక్రవారం వివరాలు వెల్లడించారు. రౌడీషీట్ ఉన్న పాతబిట్రగుంట గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్‌రెడ్డి, సన్నీ, వింజమూరుకు చెందిన దిలీప్ స్నేహితులు. వీరు కడనూతల వద్ద ఉన్న ఆర్ఎస్ఆర్ కళాశాల పాత హాస్టల్ వద్ద గ్రౌండ్‌లో నిత్యం మద్యం తాగుతుంటారు. వారు కళాశాలలో చదువుతున్న దేశిరెడ్డి నరసింహారెడ్డి అలియాస్ సైరా, తొట్టెంపూడి వాసుతో స్నేహంగా ఉండేవారు. ఈ ఇద్దరూ తమ జూనియర్లైన నవీన్, ఓబుల్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, బిట్రగుంటకు చెందిన తేలపూల ప్రదీప్‌ను ఆ ముగ్గురికి పరిచయం చేశారు. అప్పటి నుంచి జూనియర్లను ప్రసన్న, సన్నీ, దిలీప్ భయపెట్టి డబ్బు తీసుకునేవారు. ఈనెల 12వ తేదీన వాసు, నరసింహారెడ్డి, ఓబుల్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, నవీన్, ప్రదీప్‌ని ఆ ముగ్గురూ పిలిచి డబ్బులు ఇవ్వాలని బెదిరించంగా వారు లేవని చెప్పారు. మరోసారి డబ్బు అడగొద్దని సమాధానం ఇచ్చి వెళ్లిపోయారు. 14వ తేదీ మధ్యాహ్నం ప్రసన్నకుమార్‌రెడ్డి, సన్నీలు నరసింహారెడ్డిని పాత హాస్టల్‌కు పిలిపించి కర్రతో కొట్టారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని అడగ్గా నా వద్ద లేవని చెప్పాడు. స్నేహితులకు ఫోన్ చేసి ఫోన్‌పే ద్వారా నగదు వేయించాలని భయపెట్టారు. ఇంతలో అక్కడికి నవీన్, ప్రదీప్ రాగా డబ్బులివ్వాలని.. లేకపోతే చంపుతామని బెదిరించారు. బీరు బాటిళ్లు పగులగొట్టి చేతులపై గాయాలు చేశారు. బాగా భయపడిన బాధితులు ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యానికి, హాస్టల్ వార్డెన్‌కు, తల్లిదండ్రులకు చెప్పలేదు. 15వ తేదీన కళాశాల బయట పానీపూరి తింటున్న ప్రదీప్‌ను ప్రసన్నకుమార్‌రెడ్డి, సన్నీ పాత హాస్టల్ గ్రౌండ్‌కు తీసుకెళ్లారు. అతడి చేత బిర్యానీ తెప్పించుకుని తిన్నాక రూ.10 వేలు ఇవ్వాలని లేకపోతే చంపుతామని బెదిరించి గ్రౌండ్ చుట్టూ పరిగెత్తించి, గుంజీళ్లు తీయించారు. మనస్తాపానికి గురైన ప్రదీప్ ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అతని స్నేహితులు ధైర్యంగా ముందుకొచ్చుంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. ఎవరైనా బెదిరిస్తే విద్యార్థులు తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో రూరల్ సీఐ రాజేష్, ఒకటో పట్టణ సీఐ శ్రీనివాసరావు, రెండో పట్టణ ఎస్సై మాల్యాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జీవన్ (18) అనే యువకుడు మృతిచెందిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం శివారులోని చెల్లాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం వేకువజామున జరిగింది. ఎస్సై వీర ప్రతాప్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జీవన్, ముఖేష్ నెల్లూరులో రేకుల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి వారు బుచ్చిరెడ్డిపాళెంలో ఒక దుకాణానికి రేకులను బిగించారు. తిరిగి నెల్లూరుకు మోటార్ బైక్‌పై వెళ్తుండగా చెల్లాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో ఇద్దరూ పొదల్లో పడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జీవన్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ముఖేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీస్